

# స్తిమిత మనిషి

ఒక్క స్నేహితుడి వివాహానికి విశాఖపట్నం వెళ్ళేను. పెళ్ళివారితరపు వారెవ్వరూ నాకు తెలిసినవాళ్ళు కారు. ఆ ఊళ్ళోకూడా నా పరిచయస్థు లెవరూ లేరు. దూరపు బంధువులు కొందరున్నారుకాని వారి చిరునామాలు నాదగ్గిర లేవు. అందుచేత నా స్నేహితుడితో గడిపిన పరిమితకాలం తప్పించి మిగతా సమయాలలో ఊళ్ళో తిరుగుతూ కాలక్షేపం చేసేను. పెళ్ళి సైగా సానంలో జరిగింది. పెళ్ళిలో మామిడాకుల తోరణాలు, కర్పూరపు దండలు, పన్నీటిలో తడిపిన పట్టుచీరలు, ధూపవసం మైకంలో ఉన్న పెళ్ళికాని జంటలు సామ్మాంటే దశాబ్దం కిందటి మధురస్మృతు లేవో గిలిగింతలు పెట్టి ఒక తియ్యని విహారాన్ని నాలో రేపేయి. కలతచెందిన మనస్సుతో సాయంత్రం నాలుగు గంటలకి ఒంటరిగా సముద్రం వైపు బయలుదేరేను. ఎండ ఇంకా తీక్ష్ణంగానే ఉంది. రామహాలు కెదురుగా ఉన్న రాతిగట్టుమీద కూర్చొని జేబులోంచి సిగరెట్టు తీసి వెలిగించి కెరటాలు లెక్కపెట్టడం మొదలుపెట్టేను. సముద్రపు హోరుతప్పించి మరే అలికిడీ పుట్టినట్లు లేదు. జనసంచారమూ చాలా తక్కువగా ఉంది.

అలా కొంతసేపు కూర్చున్నానో లేదో నా పక్కనించి ఒక వ్యక్తి నడుచుకుంటూ సముద్రంవైపు వెళ్ళేడు.

గడ్డం గీసుకొని రెండుమూడు రోజు లయిఉంటుంది. జుట్టు రేగిఉంది. కాళ్ళకి జోడులేదు. చొక్కా, పంట్లాము మాసిఉన్నాయి. అతని నడకలో శ్రీ లేదు. కాళ్లీడ్చుకుంటూ పోతున్నాడు. ఇసకలో కూర్చుంటా డేమో అనుకున్నాను. అతను కూర్చోలేదు. ఒక పెద్ద కెరటం విరుచుకొని అతని పాదాలు తడిపింది. అతనింకా ముందుకి పోగేడు. నాలోని కుతూహలం ఎక్కువయింది. కాస్సేపటికి కెరటాలు అతని మోకాళ్లదాకా రావడం మొదలుపెట్టేయి.

"ఏమయ్యోయ్! మరి ముందుకి పోకు. డస్సెన్!" అని అరిచేను.

అతడిలో చలనం లేదు. ఒక పెద్ద కెరటం వచ్చి అతనిముందే విరిగి కోపంగా అతణ్ణి చెళ్ళున కొట్టింది. అతడు వెనక్కి తూలేడు. బట్టలు పూర్తిగా తడిసేయి. మరో నిమిషం అలాగే ఆలోచిస్తూ నిల్చున్నాడు. అతడిలో నిస్పృహ, వివేకం లోపల కొట్లాడుకుంటున్నట్లున్నాయి. చివరికి వివేకం గెలిచింది. తాపీగా వెనక్కి తిరిగి నావైపు నడిచేడు. వెనకనించి మరో పెద్ద కెరటం వచ్చి ఒక్క దెబ్బ కొట్టింది. ఇసకలో బోర్లా పడ్డాడు. మగవాడు ఏడిస్తే చాలా అసహ్యంగా ఉంటుంది. అతడలా ఇసకలో పడి ఏడుస్తూంటే నాకు సానుభూతికూడా కలగలేదు. అలా చూస్తూ కూర్చున్నాను. వాడిగ్గిరికి ఇద్దరు మనుష్యులు చేరేరు. అక్కడక్కడ మరికొందరు నిలబడి అతణ్ణి వింతగా చూస్తున్నారు.

"ఎందుకలా పడిఉన్నాడు?" అన్నా డందులో ఒకడు.

"ఆ! ఎవడో తాగుబోతు" అన్నాను సిగరెట్టు దమ్ములాగుతూ.

ఆ మాటకి అతను లేచేడు. నా దగ్గిరికి నడుచుకుంటూ వచ్చేడు.

"నేను తాగుబోతునా?" అన్నాడు.

"నువ్వు ఇందాక చెయ్యబోయే పని ఒంటిమీద తెలివి ఉన్నా డెవడైనా చేస్తాడంటావా?" అన్నాను.

అతను కాస్సేపు నావైపు నిదానంగా చూసేడు. తరవాత తలదించుకొని తాపీగా అన్నాడు: "రాజా! నువ్విప్పు డేమన్నా నీతో వాదించే స్థితిలో లేను నేను."

"నా పేరు నీ కెలా తెలుసు?" అన్నాను నేను ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవిచేస్తూ. అతను విచారంగా నావైపు చూసేడు.

"నేను జోగారావుని. మనిద్దరం బరంపురం సిటీ హైస్కూల్లో మూడు సంవత్సరాలు కలిసి చదివేం. ఇప్పుడు జ్ఞాపకం వచ్చేనా?" అన్నాడు. ఎందుకురాదూ? జ్ఞాపకంవచ్చేడు. "జోగా! నువ్వట్రా?" అని వాణ్ణి గట్టిగా కావలించుకున్నాను. జోగారావు మళ్లీ ఏడ్చేడు. ఈమారు నా జేబురుమాలుతో వాడి కన్నీళ్లు తుడుస్తూ "ఛ ఛ! ఎందుకా ఏడుపు? నలుగురూ చూస్తున్నారు. ఊరుకో" అని మెల్లిగా కసిరేను. జోగారావు పక్కకి తిరిగి ముక్కు చీందుకున్నాడు.

"పద" అన్నాను అతడి రెక్క పుచ్చుకొని.

"ఎక్కడికి?" అన్నాడు.

"సేవ్ లాడ్జిలో ఉంటున్నాను. అక్కడికి" అన్నాను.

"నేను రాను" అన్నాడు.

> పులి నోటబడకుండా ఉండేందుకు దాని పైకెక్కి కూర్చున్నవాడికి, దిగాలంటే చచ్చేభయం. దిగితే, పులి మింగేస్తుంది. దిగకుండా అలాగేకూర్చోడానికి వీల్లేదు! మనిషి చేసే కొన్ని పనులు అలాగే ఉంటాయి. దారేపోయే పీడను, ఎరక్క నెత్తి నెక్కించుకున్నా, వదిలించుకోవడం అసాధ్యం అవుతుంది. అదే ప్రాణాంతకంగానూ మారుతుంది.

"ఏం?"

జోగారావు జవాబు చెప్పలేదు.

"డోంట్ బి సిల్లీ" అన్నాను. అన్నా వాడు కదలలేదు.

"నువ్వు బట్టలు మార్చుకోవాలి. లేకపోతే జబ్బు చేస్తుంది" అన్నాను.

"చెయ్యనీ" అన్నాడు.

గత్యంతరంలేక నేను మళ్లీ కూర్చున్నాను.

"ఇంతకీ ఏమయిందో చెప్పరాదూ?" అన్నాను.

జోగారావు మాట్లాడలేదు. సిగరెట్టు అందించేను. నావైపు కొన్ని సెకండ్లు చూసి సిగరెట్టు తీసుకొని ముట్టించేడు. రెండుమూడు దమ్ములు లాగి ఒక నిట్టూర్పు విడిచేడు.

"సరే. చెబుతాను, విను. అలా చెప్పడంవల్ల నాకేమైనా మనశ్శాంతి కలుగుతుందేమో!" అన్నాడు.

కాస్సేపు నిశ్శబ్దంగా కూర్చున్నాం.

"చెప్పూ!" అన్నాను.

"అదే . . . ఎక్కడ మొదలుపెడదామా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు.

"నువ్వు చదువు మానేసిన తరవాత రైల్వేలో స్టేషనుమాస్టరుగా చేరేవని తెలిసింది. తరవాత ఏమైంది?" అన్నాను.

"ఉద్యోగంలో చేరగానే నా మేనమామ కూతుర్ని పెళ్ళాడేను. ఇప్పుడు నాకు ముగ్గురు పిల్లలు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. మా ఆవిణ్ణి నువ్వెప్పుడూ చూడలేదు కదూ?"

లేదన్నట్టు తల అడ్డంగా ఆడించేను.

"చాలా అందంగా ఉంటుంది. తెల్లగా మల్లెపువ్వులాగుంటుంది. అదంటే నాకు పంచప్రాణాలు" జోగారావు దీర్ఘంగా నిట్టూర్చేడు.

"నేను చాయ తక్కువయినా మనిషిని అందంగానే ఉంటాను కదూ?" అన్నాడు.

"నీకేమిటోయ్? మనం చదువుకునేరోజుల్లో ఎందరమ్మాయిలు నువ్వంటే పడిచచ్చేవారూ?" అన్నాను.

ఒక్క క్షణం అతడి కళ్ళు గర్వంగా మెరిసేయి.

"నీకు జ్ఞాపకం ఉంది కదూ? కాని వాళ్లతో నే నెప్పుడన్నా అట్టే చనువు తీసుకున్నానా? నా హద్దుల్లో నే నుండేవాణ్ణి. అవునా?"

వై. రఘునాథరావు

"నిజమే!" అని నేను ఒప్పుకున్నాను.

"నే నెప్పుడూ ఒక నియమంమీద నడిచే మనిషిని. సమాజం నిర్ణయించిన హద్దుల్ని నే నెప్పుడూ దాటలేదు. మా రైల్వే కాలనీలో ఎవడైనా వెళ్లి మీలో పెద్దమనుషు లెవరయ్యా అని అడిగితే ముందు నా పేరు చెప్పి తరవాత మిగతావాళ్ల పేర్లు చెప్పవలసిందే. అటువంటి ఖ్యాతి సంపాదించుకున్నాను. అటువంటి నిప్పులాటి మనిషిని, నన్ను నాకు దగ్గిర వాళ్ళు అని అనుకున్న ఆప్తులే అలా అంటారని కలలో కూడా అనుకోలేదు."

"ఆగాగు. అసలు జరిగిం దేమిటో మొదటినించి చెప్పు" అన్నాను.

"సారీ, చెబుతా. నే నిప్పుడు ఖరగ్‌పూర్‌లో పనిచేస్తున్నాను. కొన్ని సంవత్సరాలక్రితం ప్రకాశరావని ఒక టికెట్ కలక్టరు మా పక్కఇంట్లో దిగేడు. అతడూ, భార్య. పిల్లలు లేరు. చాలా కలుపుగోలు మనుష్యులు, ఓ అయిదారు నెలల్లో మా రెండు కుటుంబాలమధ్య స్నేహం గాఢమై ఒకే కుటుంబంలా మెసిలేవాళ్లం. నావి షిఫ్ట్ డ్యూటీలు. అతను ఎప్పుడూ అన్ని దిక్కులా రైళ్లలో తిరుగుతూఉండేవాడు. అందుచేత ఒకరి అవసరం ఒకరికి ఎంతైనా ఉండేది కూడా. అయితే ఆయన కో వ్యసనం ఉంది. వచ్చిన జీతంలో చాలాభాగం తాగుడికి తగలబెట్టేవాడు. ఆ దురలవాటు మానిపించడానికి చాలా ప్రయత్నాలు చేసేను. కాని లాభం లేకపోయింది. దాని పర్యవసానం ఊరినిండా అప్పులు. ఉద్యోగరీత్యాకూడా ఎన్ని అప్పులు దొరుకుతాయో అన్నీ కంపెనీలో తీసుకునేవాడు. దానితో జీతంలో చాలావరకు కోసేసి మిగతాది ఇచ్చేవారు. ఇంతకీ నేను చెప్పొచ్చేదేమిటంటే ఆర్థికంగాకూడా మేం వాళ్లని కాస్త కూస్త ఆదుకుంటూఉండేవాళ్లం."

• • •

జోగారావు మారలేదు. అతడి మంచితనం ఈనాటిది కాదు. బరంపురంలోని మా ఇల్లు చాలా చిన్నది. మా కుటుంబం చాలా పెద్దది. నాకు అయిదుగురు అన్నదమ్ములు. నలుగురు అక్కచెల్లెళ్ళు. మా నాన్నగారు ఒక పేరుపడ్డ వకీలుదగ్గిర హెడ్‌గుమాస్తాగా ఉండేవారు. అందుచేత ఒక్క జీతమేకాకుండా పైన కూడా ఆయనకి బాగా దొరికేది. కాని ఎంత గడించినా ప్రతినెలా కటాకటిగా మా కుటుంబం నడుస్తూ ఉండేది. నేను నాలుగోఫారంలో అడుగుపెట్టిన కొత్తలో మా ఇంటిపక్కడాబాఇల్లు జోగారావు కుటుంబం అద్దెకి తీసుకున్నారు. జోగారావు నా క్లాసులో చేరేడు. ఎవరితోనైనా నిమిషంమీద స్నేహం చేసే అలవాటు జోగారావుది. నాతో అలాగే స్నేహం కలిపేడు. తరవాత వాళ్ళు మా ఊళ్ళో ఉన్న మూడు సంవత్సరాలూ నేను చాలాకాలం వాళ్ల ఇంట్లోనే గడిపేను. రెండుపూట్ల కాఫీ, ఫలహారాలు జోగారావుతో నాకూ పెట్టేవారు. వాళ్ళే సినిమాకి వెళ్లినా జోగారావుతో పాటు నన్నుకూడా తీసుకొనివెళ్లేవారు. నేను వెంట లేకుండా జోగారావు ఎక్కడికీ వెళ్లేవాడుకాదు. ఇద్దరం ఎస్. ఎస్. ఎల్. సి. పాసయిన తరవాత హఠాత్తుగా

వాళ్ల నాన్నగారు పోయేరు. జోగారావుని తీసుకొని వాళ్ల అమ్మ పుట్టింటికి వెళ్లిపోయింది.

* * *

మరి ఆట్టే రోజులు బతకడని డాక్టరు చెప్పేసేడు. శరీరం లోపల భాగాలన్నీ తాగుడు బాగా కొరికేసి, గుల్ల చేసేసింది. ప్రకాశరావుని జాగ్రత్తగా రిక్షాలో కూర్చోపెట్టి ఇంటికి తీసుకువచ్చేసేను. వస్తూంటే తోవలో ప్రకాశరావు రిక్షాలో నాతో చెప్పేడు: "జోగారావు గారూ! నే నివాళో, రేపో చచ్చిపోతాను. నాగురించి నా కేనాడూ విచారం లేదు. కాని నా బెంగంతా నా భార్యని గురించే. నేను చచ్చిపోయిన మరునాడు నావాళ్లు ఒక్కరు దాన్ని చేరదియ్యరు. వాళ్ల సంగతి నాకు బాగా తెలుసు. దానికి పుట్టింటివారి తరపున ఎవ్వరూ లేరు. అందుచేత నేను చచ్చిన మరునాడు అది రోడ్డుమీద ఒంటరిగా నిలబడుతుంది. ఇన్ని సంవత్సరాలు మీరు నన్ను అన్నదమ్ముడిలాగు చూసుకున్నారు. నేను పోయిన తరవాతకూడా మన ఈ బంధుత్వం తెంపకండి. దానికి మీరే దిక్కు. దాని బాధ్యత మీరు తీసుకుంటానని నాకు మాట ఇస్తే హాయిగా ప్రాణాలు వదులుతాను" అన్నాడు. నేను కాదనలేకపోయాను, రాజూ. అతడికి మాట ఇచ్చేను. ఆ మరునాడే అతను చచ్చిపోయేడు. అత డన్నది అక్షరాలా నిజమయింది. అతని బంధువు లందరికీ టెలిగ్రాములిచ్చేను. ఒక్కరుకూడా రాలేదు. మన తెలుగువాళ్ళం నలుగురం కలిసి శవదహనం చేసేం. అతని భార్యని మా ఇంటికి తీసుకునివచ్చింది నా భార్య. అతడి తోటిఉద్యోగస్థులూ, ఇరుగుపొరుగువాళ్ళూ ఆవిడని ఓదార్చి ధైర్యం చెప్పేరు. నా ఉదారబుద్ధిని అంతా పొగిడేరు."

జోగారావు ఆగేడు. మరో సిగరెట్టు ఇచ్చేను. వెలిగించి కొన్ని దమ్ములు లాగేడు. చీకటి పడుతూంది. సముద్రం అంచుమీదినుంచి నిండుచందమామ అందంగా ఉదయిస్తున్నాడు. మా వెనక రోడ్డుమీద సందడిగా ఉంది. సముద్రంలోని రెండు ఓడల్లో దీపాలు వెలిగించేరు. జోగారావు మళ్లీ అందుకున్నాడు. "రైల్వేవాళ్లదగ్గిరనించి అన్నీ పోను ఆవిడకి రెండు వేల రూపాయలు వచ్చేయి. ఇన్సూరెన్సు ఏనాడో మురిగిపోయింది. వాళ్లదగ్గిరినుంచి ఒక పైసా అయినా రాలేదు. అదలా ఉండనీండి. కొన్ని నెలలపాటు అంతా సవ్యంగానే వెళ్లిపోయింది."

నేను చిన్నగా నవ్వేను. "ఎందుకు నవ్వుతున్నావ్?" అన్నాడు జోగారావు.

"తరవాత కథ నాకు తెలుసు. కొన్ని నెలలు గడిచిన తరవాత క్రమక్రమంగా ఇరుగుపొరుగువాళ్లు నీ భార్యకి హితబోధచెయ్యడం మొదలుపెట్టేరు. ఆఫీసులో నీ తోటిఉద్యోగస్థులు నీ మీద విసుర్లు మొదలు పెట్టేరు. ఒకనాటి రాత్రి నీ భార్య నీతో మెల్లిగా అడిగింది: "ఏమండీ! ఈవిడని మనం ఇలా ఎన్నాళ్లని భరించగలం? వాళ్ళ పిన్ని ఎక్కడో ఉందని విన్నాను. అక్కడికి పంపించెయ్యకూడదూ?"


"అరే! నీ కిదంతా ఎలా తెలుసు? వాళ్ళ పిన్నికాదు, పెద్దబావగారు!" అన్నాడు జోగారావు ఆశ్చర్యంగా.

* * *

జోగారావు మారలేదు. ఎలా మారతాడు? కాలంలో కొన్ని యుగాలు కలిసిపోయేయి. అయినా మానవుడు మారేడా? జోగారావు భార్య సలహా పాటించిఉండడు. ఊరివాళ్లు ఎంతగా అతణ్ణి అల్లరిచేస్తే అతని పట్టుదల అంతగా పెరిగిఉంటుంది.

బరంపురంలోని మా హైస్కూలుపైన ఒక డాబా ఉండేది. హైస్కూలు ఆవరణలో ఒక పచ్చికబయలు ఉండేది. ఆ జాగాలో రోజూ మేము బాల్ బాడ్మింటన్ ఆడుకునేవాళ్లం. ఒకనాడు బంతిని రోజూ తెస్తున్న కుర్రవాడు రాలేదు. మా అందరికీ చాలా ఆశాభంగం కలిగింది. డ్రిల్లుమాస్టరుగారి ఇల్లు దగ్గిరలోనే ఉండేది. ఆయనదగ్గిర మరో బంతి తీసుకుందామని ఆయన ఇంటికి వెళ్లేం. అతను ఇంట్లో లేడు. అతని కొడుకు ఏడేళ్ళ కుర్రవాడు ఉన్నాడు.

"మా నాన్న గదిలో డ్రాయరులో పాత బంతులు నాలుగున్నాయి. మీరు నన్ను సినిమాకి తీసుకెళితే అందులో ఒకటిస్తాను. ఆట అయిపోగానే మళ్లీ

పాకిచ్చెయ్యండి. మా నాన్నకి తెలియకుండా డ్రాయరులో పెట్టేస్తాను" అన్నాడు డ్రిల్లుమాస్టరుగారి అబ్బాయి. "సరే" అని ఒప్పుకున్నాం. బంతి తీసుకు వచ్చేం. ఆట మొదలయింది. ఆట మాంచి హుషారులో ఉన్న సమయంలో బంతిని మాలో ఒకడు బాగా ఎత్తుగా కొట్టేడు. బంతి ఎగిరి డాబామీద పడింది. డ్రిల్లుమాస్టరుగారి అబ్బాయి ఏడుపు లంకించుకున్నాడు. ఎందుకంటే డాబాకి మెట్లు లేవు. మా హైస్కూలంతటికి బాగా పొడుగ్గా ఉన్నవాళ్లు సుమారు ఓ డజనుమంది. అందులో సగంమంది ఇంటి గుమ్మం మీదినుంచి రోడ్డుమీదికి దూకలేని రకం. మిగతా అర డజనుమందిలో ముగ్గురే సాహసించి హైస్కూలు స్తంభాలమీదుగా డాబామీదికి ఎక్కేవారు. ఆ ముగ్గురిలో ఒక్కరూ మాలో ఆవేళకి లేరు. జోగారావుకి కుర్రవాడి ఏడుపు చూస్తే జాలివేసింది.

"ఏడవకోయ్! నీ బంతి ఎలాగో ఓలాగు నేను తీసిపెడతానుండు" అన్నాడు.

"అనడం మహా సులభం. ఎలా తీస్తావ్?" అన్నాడు మాలో ఒకడు. హైస్కూలు ఆవరణలో ఒక పోకచెట్టు ఉంది. ఆ పోకచెట్టుకీ డాబాకీమధ్య మూడునాలు గుడుగుల దూరం ఉంది. పోకచెట్టెక్కి ఆ చెట్టు మీదినుంచి డాబామీదికి దూకుతానన్నాడు జోగారావు. మేమందరం నవ్వేం. మీరు నవ్వితే నిజంగా చేసి చూపెడతానన్నాడు జోగారావు. మేమింకా నవ్వేం. కుర్రవాడు ఏడుపు మరికొంచెం ఎక్కువ చేసేడు. జోగారావు పోకచెట్టు ఎక్కడం ప్రారంభించేడు. రెండు అంగలు మీదికి పాకితే ఒక అంగ కిందికి జారేవాడు. వాడు జారినప్పుడల్లా మేము ఎగతాళిగా కేరింతలు కొట్టేం. జోగారావు చేతిమునుకులు చెట్టుకి గీసుకొని రక్తం చిమ్మేయి. జోగారావు కళ్లలో నీళ్లు తిరిగేయి. కాని మేము ఎంతగా ఎగతాళిచేస్తే అంతగా మీదికి పాకడానికి ప్రయత్నాలు చేసేవాడు. అలా ఎంతసేపు జరిగిందో తెలియదు. హఠాత్తుగా మేమంతా ఎగతాళి చెయ్యడం మానేసేం. జోగారావు చెట్టుకొమ్మలు చేరుకున్నాడు. అక్కడినుంచి కిందికి మావైపు పురుగుల్ని చూసినట్టు నిరసనగా చూసేడు. ముందుకీ వెనక్కీ రెండుమూడుసార్లు ఊగి చెట్టుకొమ్మమీదినుంచి డాబామీదికి ఒక్క ఉరుకు ఉరికేడు.

* * *

"ఆవిడని తక్షణం ఇంట్లోంచి బయటికి పంపించకపోతే నూతిలోకి దూకుతానంది. చెప్పొద్దూ మరీ! నాకు చాలా కోపంవచ్చింది. "అదేదో చేసి చూపించు" అన్నాను. అన్నంత పనీ చేసింది. మా ఇంటికి ఓ మైలుదూరంలో ఏనాటిదో ఒక పాత నుయ్యి ఒకటి ఉంది. అందులో దూకింది. నా అనుమానం ఏమిటంటే అందరూ చూస్తూ ఉండగానే దూకిఉంటుంది. ఏదైతేనేం, నలుగురూ దాన్ని బయటకి లాగేరు. అప్పటికే కడుపుతో ఉందేమో అదికాస్తా పోయింది. హాస్పిటల్‌లో చేర్పించేను. మా ఆవిడ కోరిన సానుభూతి నాలో కలగలేదు సరికదా అసహ్యంకూడా వేసింది. అయితే నా చుట్టుపట్ల ఉన్నవాళ్లలోమాత్రం ఆవిడమీద చాలా జాలి, నా మీద, ప్రకాశరావు భార్యమీద కోపం అమితంగా పుట్టుకువచ్చేయి. రాత్రిళ్లు నా ఇంటిమీద రాళ్లు రువ్వడం ప్రారంభించేరు. ఊళ్లో ఉన్న అమాయికపు ఆడవాళ్లందరినీ పాడుచేస్తున్నాననీ, నన్ను ఉద్యోగంలోనించి వెంటనే తీసెయ్యమనీ మా పై ఆఫీసర్లకి ఆకాశరామన్న ఉత్తరాలు రాసేరు. దాంతో నిత్యం ఏవో ఎంక్వయిరీలూ, నా కేవేవో వార్నింగ్ లెటర్లూ రావడం మొదలుపెట్టేయి. నా మామయ్యకి ఎవడో పుణ్యాత్ముడు ఈ గొడవఅంతా రాసిఉంటాడు. ఆయన హఠాత్తుగా ఒకనాడు మా ఊళ్లో దిగబడి నేను ఇంట్లోలేని సమయంలో అవిడని నానామాటలూ అని తన్నేటంత పని చేసేడు. నేను ఇంటికి రాగానే నామీద విరుచుకొనిపడ్డాడు. ఇన్నేళ్లు వచ్చింతరవాత ఇవేం పాడుబుద్ధులన్నాడు. నా మూలంగా తన ఊళ్లో అతడు తలఎత్తుకొని తిరగలేకుండా ఉన్నాట్ట. నా భార్య హాస్పిటల్‌నించి ఇంటికి రాగానే నా ఇంట్లో ఒక్క క్షణం ఉండనంది. "అయితే శుభస్య శీఘ్రం! పో" అన్నాను. ఆ రోజంతా అది పెద్ద దీర్ఘాలు తీస్తూ ఏడ్చి సాయంకాలం బండిలో పిల్లల్ని తీసుకొని తండ్రితో పుట్టింటికి పోయింది. పోతూ పోతూ "ఈ ముండ ఉండగా ఈ ఇంట్లో మళ్లీ కాలు పెట్ట"నని శపథం పట్టి మరీ పోయింది."

"అయితే, జోగారావ్, ఈ గొడవలన్నీ పడేబదులు ఆవిడని నీ భార్య సలహా ప్రకారం వాళ్ల పెదబావగారి ఇంటికి పంపించెయ్యలేకపోయేవా?" అన్నాను నేనూ మధ్య మధ్య ఏదో అంటూ ఉండకపోతే బాగుండదని. జోగారావు తారాజువ్వలాగు లేచేడు.


"నువ్వూ అదేమాటంటావ్! మొగుడు చచ్చి, క్షయరోగంతో బాధపడుతూ నేనుతప్ప తన కింకెవ్వరూ దిక్కులేని ఒక ఆడదాన్ని తోడేళ్లకీ, రాబందులకీ అప్పచెప్పమంటావ్? అలా అనడానికి నీకు నోరెలా వచ్చింది, రాజూ?" అన్నాడు.

"క్షయరోగమా?" అన్నాను ఆశ్చర్యంగా.

"పారిపోయింది. అయితే ఇంతసేపూ ఏమిటి వింటున్నావ్? ఆవిడ కాళ్లమీద ఆవిడ నిలబడగలుస్తే ఇంకేముంది? ఆవిడ చాలా అభిమానం గల మనిషి. ఏనాడో తన దారి తను చూసుకునేది. రోగాన్ని చాలా రోజులు మాకు తెలియనివ్వకుండా దాచి ముదరపెట్టుకుంది. నాకు తెలిసిన తరవాత రాంచీ తీసుకొనివెళ్లేను. వాళ్లేవేవో ఆ పరీక్షలూ, ఈ పరీక్షలూ చేసి మరో ఆరు నెలలు ఆలస్యం చేసేరు. నేనిలా ఆవిడని ఆ ఊరూ, ఈ ఊరూ వైద్యంకోసం తీసుకొనివెళుతూంటే మేమిద్దరం ఖుషీకి వెళుతున్నాం అన్నారు మా ఊళ్లోని కుక్కవెధవలు. ఈ ప్రయాణాలలో ఆవిడకి వచ్చిన ప్రావిడెంట్‌ఫండ్ అంతా ఖర్చయిపోయింది. నేను ఎన్ని అప్పులు చెయ్యాలో అన్నీ చేసేసి వాడేసేను. రోగంమాత్రం నయంకాలేదు. అప్పు డెవరో సలహా ఇచ్చేరు, విశాఖపట్నంలో ఆఖరి ప్రయత్నం చెయ్యమని. ఇంట్లోని సామానంతా అమ్మేసేను. అక్కడా ఇక్కడా ఎవరో పుణ్యాత్ములదగ్గిర మరో అయిదువందలు అప్పుచేసేను. ఆవిడని తీసుకొని వారంరోజుల కిందట ఈ ఊరు వచ్చేను. రామారావు జ్ఞాపకం ఉన్నాడా? వాడు డాక్టరై ఇక్కడే పనిచేస్తున్నాడు. వాడి ఋణం ఎలా తీర్చుకుంటానోగాని ఎంతో సాయం చేసేడు. ఆవిడని వెంటనే హాస్పిటల్లో చేర్పించేడు. అన్ని పరీక్షలూ అయేక ఒక పెద్ద ఆపరేషన్ చెయ్యాలన్నాడు పెద్దసర్జను. ఆ ఆపరేషన్ మొన్న జరిగింది. నిన్న పొద్దున్న పెద్దసర్జను నాతో ఆపరేషన్ చెయ్యడంలో ఏం లోపం లేకపోయినా, ఆమె బతకడం కష్టమనీ, మహా బతుకుతే మరికొన్ని గంటలనీ నాతో చెప్పి పెదవి విరిచేడు."

జోగారావు దీర్ఘంగా నిట్టూర్చేడు.

"నిన్న రోజంతా ఆవిడని కనిపెట్టుకుని కూర్చున్నాను. సాయంత్రం కళ్లు విప్పింది. నన్ను దగ్గిరగా రమ్మని సంజ్ఞచేసింది. ఎంతో కష్టంతో చెప్పింది, "రావుగారూ! నన్ను చావనివ్వండి. నేను బతికి ఎవరిని ఉద్ధరించాలి? ఎవరికోసం?" అని. ఆ రాత్రి నిద్రపోతున్నప్పుడు అనుకున్నాను: 'భగవంతుడి సంకల్పాన్ని అడ్డడానికి మానవమాత్రులం మనమెవరం? నా బాధ్యత నేను నెరవేర్చేను. నన్నిప్పు డెవ్వరూ వేలెత్తి చూపలేరుగదా? ఆమె అన్నది నిజమే. ఆమె కీ లోకంతో



ముఖం ఎలాగూ లేదు. "ఓ భగవాన్! ఆమె కోరికను తీర్చి ఆమె ఆత్మకి శాంతి కలుగచెయ్యి" అని భగవంతుణ్ణి మనసారా ప్రార్థించి పడుకున్నాను."

జోగారావు గొల్లుమన్నాడు.

"ఇవాళ ఉదయం ఆమె శవదహనానికి ఏర్పాట్లన్నీ చేసి హాస్పిటల్‌కి వెళ్ళేను. ఆమె చచ్చిపోలేదు. బతికే ఉంది. పెద్దసర్జనుదగ్గిరికి పరిగెత్తేను. కంగ్రాట్యులేషన్సు!" అన్నాడు. తన ఇన్నాళ్ల అనుభవంలోనూ ఇటువంటి అమోఘమైన కేసు ఎప్పుడూ చూడలేదన్నాడు. ఆమె బతకడం ఒక విడ్డూరం అన్నాడు."

"ఓరి దౌర్భాగ్యుడా! అయితే ఏడుస్తున్నా వెందుకూ?" అన్నాను నాకేమీ అర్థంకాక.

"ఏడవక ఇప్పుడు నన్నేం చేయమంటావ్? స్నేహితులకీ బంధువులకీ దూరమయ్యేను. ఉన్న డబ్బంతా తగలెట్టి దివాలాతీసేను. రంభలాటి భార్య నన్ను వదిలి పుట్టింటికి పోయింది. ఈ రోగిష్ఠి మనిషి నా మెడకి గుదిబండలా తగులుకుంది. ఈమె చచ్చిపోయిఉంటే అన్ని సమస్యలూ తీరిపోవును గదా! ఇప్పుడు నాకేం దారి? నాకు చావుతప్ప మరేం మిగిలింది? చెప్పు రాజా! దేవుడికి నామీద ఎందు కింత కసి! నేనేం తప్పు చేసేననీ?"

• • •

డ్రిల్లుమాస్టరుగారి అబ్బాయి చేతిలోకి డాబామీదనించి బంతి విసిరేసేడు జోగారావు. "చీకటి పడుతూంది. చప్పున దిగు" అని హెచ్చరించేను నేను. ఒక నిమిషం గడిచింది. రెండునిమిషాలు గడిచేయి. అయిదు నిమిషాలు గడిచేయి. జోగారావు కిందికి దిగలేదు. "దిగవేం?" అన్నాను నేను. డాబామీదనించి జవాబు రాలేదు. మా గుంపులోంచి ఒకడు కిసుక్కున నవ్వేడు.

"ఎలా దిగుతాడూ? పోకచెట్టుమీదికి డాబామీదినించి ఎగరలేడు కదా? డాబామీదినుంచి కిందికి దూకితే కాళ్లు విరుగుతై."

"హా హా హా" అని మా గుంపంతా బిగ్గరగా నవ్వేరు. కేరింతలు కొట్టేరు. నా స్నేహితుణ్ణి వాళ్ళలా ఎగతాళిచేస్తుంటే నాకు కోపం వచ్చింది.

"డాబా అట్టే ఎత్తు లేదు. ఇక్కడ గడ్డి ఒత్తుగా ఉంది. కిందికి దూకెయ్, జోగా!" అని హెచ్చరించేను. జోగారావు కిందికి చూసేడు. మమ్మల్ని చూసేడు. గడ్డిని చూసేడు. డాబా అంచున నిల్చుని ముందుకీ వెనక్కీ ఊగేడు.

"దూకెయ్!" అన్నాను నేను హుషారుగా.

చప్పున జోగారావు డాబామీద చతికిలబడి పెద్దగా ఏడవడం మొదలుపెట్టేడు. "నాకు భయంవేస్తూంది. నేను దూకలేను, రాజా!" ★


టెరిలిన్ ముక్కలు

టెరిలిన్ పెంట్, షర్టు ముక్కలు 1.25 & 2.25 మీటరు రెండు ముక్కల క్లియరెన్సు అమ్మకపు ధర రు. 28-50. వి. పి. పి. చార్జీలు రు. ౭-50.



ARVIND AGENCIES (AP
P.O. Box 1408, Delhi-6.



ఫోల్డింగ్ 50 షాట్ పిస్టల్

లైసెన్సు అక్కరలేదు. అమెరికన్ మోడల్. దొంగలు క్రూరమృగములనుండి రక్షించుకోండి. ఉల్లాస ప్రయాణాలు, యాత్రలు, నాటకాలకు ప్రశస్తమైనది. ఆటోమేటిక్ 50 షాట్ల ఏర్పాటు గలదు. తేలికైనది. ఇందునుండి వెలువడు నిప్పు రవ్వలు మిమ్మును కాపాడును. ధర: 50 షాట్లు జర్మన్ మోడల్ నెం. 99 రు. 15 50. వి. పి. పి. చార్జీలు రు. 2/50. లెదర్ కేస్ రు. 7/— అదనపుషాట్లు 100కి రు. 5—




M/s. GEMS ARTS (APW-15)
P. Box 1325 Delhi.





నేత్రరక్షణకు, సౌందర్య పోషణకు




దర్బార్ కాటుక
(రిజిస్టర్డు)
మరియు
దర్బారీ గంధ్ (తిలకము)
నేత్రజ్యోతి సుర్మా
స్పెషల్ కుంకుమ వగైరా
రాంబీర్ కం., బొంబాయి-4. BR.